
భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో
ద్వితీయ బహుమతి పొందిన కథ




# అగరొత్తులు

శిరంసెట్టి కాంతారావు

ఏదో నాలుగిండ్లల్లో పని జేసుకొని నేనూ, నా పిల్లలు పొట్ట బోసుకుంటాంగాని నేనా స్కీమ్‌లో చేరను దేవుడో అని మొత్తుకున్నా వినకుండా నన్ను వజబట్టి స్కీమ్‌లో చేర్పిస్తివి. చేరిన దగ్గర్నుంచి లోను దీసుకో, లోనుదీసుకొమ్మని ప్రాణం దీస్తివి. సర్లెమ్మని పదివేలు లోను తెచ్చి చేతిలోబోసి ఇస్త్రీ బండి ఎయ్యమంటే, నాల్గురోజులబాగోతం జేస్తివి. ఆబండెటుబాయెనో? ఆఁ పెట్టేమాయెనో చూడకుండ తాగితందనాలాడితివి. తీరా జూస్తే ఆఁ పదివేల అప్పుమాత్రం ఉరితాడులెక్క నా మెడకుచుట్టుకునె. డబ్బులిచ్చిన స్కీవోడు బర్రు,బర్రున బండేసుకొని వస్తుంటే వారం, వారం రెండొందలేభై రూపాయలు కట్టలేక నాతాదు దెగుతుంది. మా గ్రూపులున్న నలుగురు నోటి గద్దరోళ్ళే. ఒక్క వారం కిస్తీ గట్టకుంటే, ఇంటి మీది కొచ్చిపడి అనరాని మాటలంటారు. ఆనక వాళ్లు మాత్రం ఏంజేస్తార్లే. వాళ్ళూ మన్లాంటాళ్ళేనాయె. వాళ్ళ కిస్తీలు వాళ్ళ కట్టుకోంగ మనవాడ కడతారు? అసలామాటలు పడేదానికంటే, ఇంతవిషం మింగి చచ్చుడునయం. చస్తే ఉన్న ఇద్దరాడపోరగాళ్ళ బతుకేమైద్దోనని ఆలోసిస్తున్నాగాని లేకుంటే ఆపని ఎప్పుడో చేద్దును.' ఉండమ్మా! బొట్టుపెడతా (మైక్రో ఫైనాన్స్) స్కీమ్‌లో చేరి పదివేలులోను తీసి భర్తకిచ్చిన సావిత్రి ఎన్ని మాటలంటున్నా అతను మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు నడిమంచంలో వెల్లకిలా పడుకునీ పైకి చూస్తున్నాడు తప్ప నోరు విప్పి ఒక్కమాట మాట్లాడలేదు.

అంతలోనే సావిత్రి భయపడ్డట్లుగానే వాళ్ళ గ్రూపువాళ్ళు నలుగురూ కట్టగట్టుకొని వచ్చి 'ఏం సాయిత్రీ! పోయిన వారం కిస్తీమానెత్తినేసి ఇంతవరకియ్యకపోతివి. మళ్లా ఎల్లుండి మంగళ వారం కిస్తీరోజు దానే వస్తుండె. ఎల్లుండి గూడ కట్టకుంటే బొడ్లో చెయ్యేసినిలేస్తం. తెచ్చుకొని వాడకదొబ్బుడం తెల్సినప్పుడు వారం, వారం కిస్తీలు గట్టాల్నని తెలియదా?? మేమెక్కణ్ణుంచి దెచ్చికట్టాల? ఒక్కరోజు గూడానాగాలేకుండ ఆ కుతారి పనికి బొయ్యి, మేస్త్రీముండాకొడుకుల ఏతువ మాటలు, ఎచ్చిడి సూపులు బరాయించుకుంట తెచ్చికడున్నాం. నీలెక్కనీడ పట్టున ఆఁ ఇల్లు, ఈఁ ఇల్లు దిరుక్కుంట చేసేపని నాబ... బాటలతాడింబోసి కుక్కల్ని వదిలినట్టు ఆఁ స్కీమోడేమో పుట్టి నోళ్ళందర్ని స్కీమ్‌లో చేర్పిచ్చుకోని ఐదుగురైదుగురు చొప్పున గ్రూపులు చేసిపెట్టి, అడిగినోల్లకు లేదనకుంట అప్పులిస్తడు. ఏ గ్రూపుల ఏ ఒక్కళ్ళు కట్టకున్నా మిగతా నలుగురం గల్సివాల్లదిగూడా కట్టేటట్టు ఒప్పించుకొని అదేమాటను వారం,వారం దేవుని మీద ప్రమాణం చేయిస్తాడు. అప్పిచ్చినవాడు బాగానే ఉంటాడు, తీసుకొని కిస్తీలుగట్టనోల్లు బాగానే ఉంటారు. మద్దిన మాలాంటోళ్ళకు కట్టలేక చావొస్తుంది' అంటూ వచ్చిన వాళ్ళు నలుగురూ చింతకాయ దులిపినట్టు పళ్ళ, పళ్ళ మాట్లాడుతుంటే మారు పలుకలేక మౌనంగా నిల్చుండి పోయింది సావిత్రి.

ఆఖరికి 'నాపిల్లల మీదొట్టు,ఆఁడబ్బుల్లోంచి నేనొక్క రూపాయిగూడా వాడుకోలేదు. తెచ్చిన దబ్బులు తెచ్చినట్టే వాడిమొకాన గొట్టిన. ఇయ్యకపోతే తాగొచ్చి కొట్టి చంపుతుండె, ఇస్తే ఇట్ల జేసె. పోయినవారం మీరుగట్టిన కిస్తీ, ఈ వారం కిస్తీ మొత్తం గలిపి ఐదొందలు ఎక్కణ్ణుంచి దెచ్చి కట్టాల్నో అర్థంగావట్లే. ఎటుజూసినా చావు దప్ప వేరే దారే కనబడట్లే' మంచం మీద పడుకున్నమగనికేసి చేతులుచాపి సాపిస్తూ ఏడ్చుకుంటూ బదులిచ్చింది సావిత్రి.

'ఏందమ్మోవ్! ఏందినువ్ మాట్లాడేది? నువ్ చస్తే నీతోపాటు మేంగూడా సావాల్సిందే ఎరికేనా? దబుక్కున నువ్వు చచ్చినా, నీ బాకీ సచ్చినట్టు మేం గట్టాల్సిందే. అప్పుడు మా మొగుళ్ళు మమ్మల్ని నిజంగానే చంపుతరు. తీసుకున్నబాకీ తీరినాక సస్తావో, బత్కుతావో నీ ఇష్టం. అగో! మొన్నఆఁ మంగలిభద్రమ్మ ఏంజేసిందో ఎరికేనా? తను కిస్తీకోసమని దాసిన డబ్బులెత్తుకు పోయిన మొగుడు పేకాటల తగలేసిండంట. తీరా వారం నాడు డబ్బులు గిడదామని చూస్తే ఇంకాడ దొరుకుతై. పాపం! బిడ్డ వలవల ఏడ్చుకుంట వారం నాడు కిస్తీ గట్టకుంటే గ్రూపోళ్లు ఇంటిమీద బడి ఎన్ని మాటలంటరారో? ఏమెత్తుకుపోతరో? అని తుమ్మెదరెక్కల్లాంటి మెత్తటి జుట్టు, సవరాలోల్ల కమ్ముకొచ్చి డబ్బులుగట్టింది. అయ్యోబిడ్డా! అట్లెందుకు చేశావంటె, జుట్టు ఇయ్యాల బోతె మల్లరేపు పెరుగుద్ది. కానీ, ఇయ్యాల బారయినపరువు మళ్లీ రాదుగా అంది. అదిగో! పరువుగల్ల ఆడదంటే అట్లుంటుంది. ఇంకొంత మందుంటారెందుకు? ఎన్నన్నా రోషం లేని మనుషులు. సరే, ఈ మాటలన్ని ఎందుగ్గాని ఎల్లుండికల్లా ఐదొందలుకట్టకుంటె మాత్రం ఇంటిమీద బడి ఏదో ఒకటిగుంజుకుపోతం. తరువాత నీ ఇష్టం మరి. ఆఁ మాటచెప్పి పోదామనే వచ్చినం' గుండె కాయలు అవిసి పోయేటట్టు పళ, పళ మాటలంటూ వెళ్ళిపోయారు వచ్చినవాళ్ళు

నలుగురు.

సందట్లో సడేమియా అన్నట్టు ఎప్పుడో చల్లగా జాసుకున్న భర్తను తలుచుకుంటూ 'ఇట్లాంటోడితో ఈ సంసారం ఈదేదెట్లా? ఒక్కదాన్ని ఎంతకని చావాలి? ఎల్లుండికల్లా ఐదొందలు యాడికెల్లి దేవాలి? ఈ స్కీములొచ్చి ఎవర్నిబాగుజేసినయో తెలవదుగాని, ఒక్కొక్కళ్ళు పరువుకు పడి ఛస్తున్నారు. పోయిననెల్లో పాపం! ఆఁదూదేకుల 'కాశింబీ' రెండు వారాలు కిస్తీ గట్టలేదని గ్రూపోళ్ళంతా ఇంటిమీది కొచ్చి గొడవజేస్తుంటే, పరువు బోయినంక బతికెందుకని జెప్పి బాయిలోదుంకె. అట్లయినా జాలిదలచి ఊకున్నారా ఇంటిగ్రాజులు బల, బల మొత్తుకుంటుంటే గూడా గ్యాస్ బండ ఎత్తుకుపోయిరి. మరి, రేప్పొద్దున మా ఇంటి మీదగూడా అట్లానే పడితే అప్పుడు నాగతేంది? పోనీ, ఏదన్నా అమ్మికడదామన్నా వంటిమీద చిన్నమెత్తు బంగారం లేకపాయె, ఇంట్లో కిలో ఎత్తు ఇత్తడి కూడ లేకపాయె. 'మరేంజెయ్యాల? ఏం జెయ్యాల? ఏంజేసి ఎల్లుండికల్ల ఐదొందలు సంపాయించాల' అనుకుంటూ ఆలోచనల్లో పడి కొట్టుకు పోయిన సావిత్రి 'ఔను, అంతకంటే దారిలేదు. ఆఁ బ్యాంక్ మేనేజర్ శంకరం గాడు పెళ్ళాం, పిల్లల్ని హైద్రాబాద్‌లో పెట్టిఈడ ఒక్కడే ఛస్తున్నాడు. నెలకాంగానే ఠంఛనుగా వాడిచ్చే నెలజీతానికి ఆశపడి వాడి రూమ్‌లో పని చేయాల్సిందే తప్పమరేంలేదు. వాడి వెకిలి చూపులు, వాడి ఎబ్బిడి మాటలు భరించలేక రోజుచచ్చిబతుకుడౌతుంది. ఇంట్లోకి పోతే చాలు ఎర్రెత్తిన కుక్కలాగ వెంటబడి వేదిస్తుంటాడు. అయినా ఇన్నాళ్ళు వాణ్ణి లెక్కజెయ్యని నాకు ఇప్పుడిక తప్పేటట్టులేదు. ఎల్లుండి ఐదొందలు కట్టకపోతే నలుగురు ఇంటి మీదికొచ్చి పరువు తీస్తారు. దానికన్నా ఆ శంకరంగాడిలో నాలుగ్గోడల మధ్య నాలుగు నిమిషాలు కండ్లు మూసుకుంటే-? ' సావిత్రిలో ఆర్పివేయఅలవిగాని అంతర్జ్వలనం.

'అమ్మా! ఇంట్లో కుక్కదూరి కుండముట్టి పోతున్నా చూడకుండ ఆలోచిస్తున్నావేంటి? అయ్యో! ఈ ఎంగిలన్నం పారెయ్యమంటావా? ఉంచమంటావా?' అప్పుడే బడికి వెళ్ళొచ్చిన పదేండ్ల సావిత్రి పెద్దకూతురు ప్రశ్నించింది.

అప్పటిదాకా ఆలోచనల్లో మునిగి తేలుతున్న సావిత్రికి కూతురు మాటలు వినిపించినా వినిపించనట్టే నటించింది పాపం!




**190 పేజీలతో**

**ప్రముఖ రచయితలతో,**

**చినుకు మూడవ వార్షిక ప్రత్యేక సంచిక**

**వెల రు.35/- (పోస్టేజితో సహా).**

**కావలసినవారు ఎం.ఓ. ద్వారా 'చినుకు'**

**కార్యాలయానికి పంపించగలరు.**

**చినుకు మాసపత్రిక,** దత్తాస్ నయాబజార్,

రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,

గాంధీనగర్, విజయవాడ - 520 003.

Phone: **0866-6640595,** E-mail :

editor_chinuku@yahoo.com

కవిత

# స్వాగతం

ఒరియామూలం : **జగన్నాథ ప్రసాద్‌దాస్**

అనువాదం : **జగద్ధాత్రి**

నీవు వస్తున్నావనే
వసంతం ముందుగానే వచ్చి
నాఇంటిముందర
గుడారం వేసుకుంది

స్వాగత గీతక సాధనలో
పక్షులు ఆకులతో గొంతుకలిపాయి
గాలి తలుపులు తెరచి
తెరలను దూరం జరిపింది
చేతులలో పుష్పగుచ్ఛాలతో
చెట్లు వాకిలి వద్ద బారులు తీరాయి

నీవు వస్తున్నావని
సమయానికి ముందే
ఉదయానికి సెలవిచ్చేశాను నేను
పోస్ట్‌మాన్‌ని, టెలిఫోన్‌ని
నన్ను విసిగించొద్దని చెప్పాను
నేనింట్లో ఉండటం లేదని
నా స్నేహితులకు చెప్పాను
నీవు వస్తున్నావు గనుకనే
అపరాహ్నపు గడియారం
బాధ్యతాయుతంగా
చేతులు కట్టుకు నిలబడింది,
ఎందుకంటే
కాలాన్ని ఆగి- నిరీక్షించమని
అడిగాను నేను